నీరుగారుతున్న లక్ష్యం!

- భారీవర్షాలకు తెగిన చెక్‌డ్యాంలు
- పట్టించుకోని అధికారులు
- వృథా అవుతున్న వర్షపునీరు

మడకశిరరూరల్: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంపొందించేందుకు డ్వామా(జిల్లా నీటి యాజమాన్యసంస్థ) ఆధ్వర్యంలో ప్రభుత్వం మండలంలో పెద్ద ఎత్తున చెక్ డ్యాంలు నిర్మించింది. అయితే కొన్నిచోట్ల భారీ వర్షాలకు చెక్ డ్యాంలు తెగిపోయాయి. వాటిని మరమ్మతు చేయకపోవడంతో వర్షపునీరు వృథా అవుతోంది. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

పట్టించుకునే వారేరీ?

జమ్మానిపల్లి సమీపంలో మూడు, దేవన్న పాళ్యం వద్ద రెండు చెక్‌డ్యామ్‌లు గతంలో వర్షాలకు తెగిపోయాయి. వీటిని మరమ్మతు చేసి వర్షపునీటిని సంరక్షించాలని గతంలో రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. వర్షపు నీరు నిల్వ ఉంటే ఈ చెక్‌డ్యామ్‌ల ద్వారా రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది. వర్షాకాలంలోపు చెక్‌డ్యామ్‌లను మరమ్మతు చేస్తే వర్షపు నీరు నిల్వ ఉండి బోరు బావుల్లో నీటి మట్టం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

ఉపాధి హామీ ద్వారా మరమ్మతులు చేయాలి

ఉపాధి హామీ పథకం ద్వారా తెగిపోయిన చెక్‌డ్యామ్‌లను మరమ్మతులు చేసి వర్షపు నీరు వృథాగా పోకుండా నిల్వ చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. వర్ష కాలం ప్రారంభం లోపే మరమ్మతు పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ చెక్‌డ్యామ్‌ల్లో వర్షపు నీరు నిల్వ చేస్తే సమీప గ్రామాల్లో వాటర్ స్కీమ్, వ్యవసాయ బోరుల్లో నీటి మట్టం పెరిగి పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది.



దేవన్న పాళ్యం వద్ద తెగిపోయిన చెక్‌డ్యామ్

నీటిని సంరక్షించాలి



మండలంలో వివిధ గ్రామాల్లోని వంకల్లో తెగిపోయిన చెక్‌డ్యామ్‌ల మరమ్మతు పనులు చేసి వర్షపు నీరు వృథాగా బయట ప్రాంతానికి పోకుండా సంరక్షించాలి. వర్షపు నీరు వృథాగా పోతుండడంతో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయి పంటల సాగు చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి.

నరసింహ, గౌడనహళ్ళి మడకశిర మండలం

చెక్‌డ్యామ్‌లు మరమ్మతు చేయాలి



దేవన్న పాళ్యం గ్రామ సమీపంలోని వంకలో తెగిపోయిన చెక్‌డ్యామ్‌లను మర్మమతు చేసి వర్షపు నీరు నిల్వ ఉండేలాచూడాలి. చెక్‌డ్యామ్‌ల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే బోరు బావుల్లో నీటి మట్టం పెరుగుతుంది. ప్రసుత్తం వర్షపు నీరు వృథాగా దిగువ ప్రాంతానికి పోతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

రంగస్వామి, అయ్యవారిపల్లి, మడకశిర మండలం

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి

పావగడ: స్థానిక బీఈఓ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'రండి పిల్లలు రండి..ప్రభుత్వ పాఠశాలలకు రండి' అనే టేప్ రికార్డర్ పాట ను ఆటో వాహనం లో మైకు ద్వారా ప్రజలకు వినిపిస్తూ తల్లిదండ్రులకు సర్కారి బడుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఈఓ ఇంద్రాణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలల విద్యార్థులను నేటి నుంచి పాఠశాలలకు రావాలని ఆత్మీయంగా స్వాగతం పలకడానికి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రచార రథం ప్రధాన రహదారుల్లో సాగింది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు బీఈఓ పిలుపునిచ్చారు. బీఆర్సీ వెంకటేశ్, ఈసీఓ వేణుగోపాలరెడ్డి, ఎస్డీఎమ్సీ అధ్యక్షుడు మల్లికార్జునప్ప, హెచ్ఎం శంకరనాయక్, ఉపాధ్యాయులు ఆనందప్ప, దుర్గమ్మ, కస్తూర్బా పాఠశాల హెచ్ఎం సావిత్రమ్మ, ఆదర్శ పాఠశాల ఎస్డీఎమ్సీ అధ్యక్షుడు ప్రకాశ్, బేకరి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

రొళ్ల: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భూతప్పస్వామి ఆలయ ఆవరణలో గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రం, ఫోర్డు సంస్థ, ఐసీటీఎస్ ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళా బృందం సభ్యుడు అనిల్‌కుమార్ హెచ్ఐవీ/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవీ వచ్చిన వారికి అందే ఏఆర్టీ సేవలను వివరించారు. బాధితుల పట్ల వివక్ష చూపొద్దని ఆట, పాటల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ అంజినప్ప, ల్యాబ్ టెక్నీషియన్ రమణనాయక్, జమేదార్ రామలింగయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వత్థనారాయణ, ఓఆర్‌డబ్ల్యూలు అనిత, గీత, రంగలక్ష్మీ, పీర్ ఎడ్యుకేటర్స్, హైరిస్క్ గ్రూప్ హెచ్ఆర్జీలు, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.



ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళా బృందం

రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన



ఆలయంలో ప్రతిష్టించిన రామలింగేశ్వరస్వామి



ప్రత్యేక పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామపెద్దలు, గ్రామస్తులు గురువారం నిర్వహించారు. అనంతరం వేదపండితులు హోమాలు నిర్వహించారు. వేదపారాయణం, ప్రాణప్రతిష్టాపన, పంచామృత అభిషేకం, దుర్గా హోమం, మూర్తి హోమం, రుద్రహోమం, తత్వన్యాస హోమం, కళాహోమం, ప్రతిష్టాపన హోమం తదితర పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోశాధికారి మాధవరెడ్డి, స్పోక్స్‌పర్సన్ మల్లన్న, సీనియర్ నాయకులు చలపతి, నాయకులు ఆనంద కుమార్, వెంకటేష్, భాస్కర్, రామాంజి, శ్రీరామప్ప, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నకిలీ పత్రంతో మోసం చేశారు'

పావగడ: స్థానిక గ్రీన్ ఇన్ఫో ఎండ్ ఎనర్జీ లిమిటెడ్ ప్రైవేట్ కంపెనీ నుంచి అసలైన ఖరారు పత్రం ఇవ్వకుండా నకిలీ పత్రం అందించి అధికారులు తనను వంచన చేశారని కడపలకెరె గ్రామం రైతు మహిళ ప్రేమక్క ఆరోపించింది. గురువారం ఆమె మాట్లాడుతూ కడపలకెరె గ్రామంలోని 46–2 సర్వేనంబరు లోని దళవాయిహళ్లి నుంచి అరక్యాతనహళ్లి వరకు 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభం, తంతి వేయడానికి కేవలం 3 స్తంభాలని చెప్పి 5 స్తంభాలను వేసి ఒక ఏడాది వాయిదా ప్రకారం ఖరారు పత్రం రాయించుకుని తనకు నకిలీ ఖరారు పత్రం అందించి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ఖరారు పత్రం ముగిసి రెండు నెలలైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తన పొలంలో నుంచి స్తంభాలను తొలగించలేదని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు స్తంభాలను, తంతిని తొలగించాలని లేని పక్షంలో కుటుంమంతా విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ తామని హెచ్చరించింది.



నకిలీ పత్రాన్ని చూపిస్తున్న బాధితురాలు

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులకు అగచాట్లు

మడకశిర: నియోజకవర్గంలో రెండు రోజులుగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. మడకశిర ఆర్టీసీ డిపోలో మొత్తం 28 బస్సులు ఉండగా.. అందులో 22 బస్సులను కడపలో జరిగే మహానాడుకు పంపారు. బుధ, గురువారం రెండు రోజులు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తిరగాల్సిన పల్లెవెలుగు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పోయే ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ అధికారుల తీరు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులు లేక చివరకు ప్రయాణికులు ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించి వారి గమ్య స్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా గురువారం మడకశిర వారపు సంత కావడంతో గ్రామాల ప్రజల సైతం వారపు సంతకు వచ్చి కూరగాయలు తీసుకుని వెళ్లడానికి నానా ఇబ్బందులు పడ్డారు. మహానాడుకు ఆర్టీసీ బస్సులను తీసుకుని ఇబ్బందులు పెట్టడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు శ్రీకాంత్

పావగడ: తాలూకాలోని కెంచమ్మనహళ్లి గ్రామానికి చెందిన యువ క్రికెటర్ కేజీ శ్రీకాంత్ అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. నేపాల్‌లోని పోఖారాలో నిర్వహించే ఇండో–నేపాల్ అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్ షిప్‌లో ఇండియా జట్టు తరపున పాల్గొననున్నారు. అయితే అతను నైన్–ఏ–సైడ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణ పొందాడు. వైజాగ్ గోల్డ్ కప్ , వైజాగ్ ట్రై సిరీస్‌లో పాల్గొనడంపై దృష్టి పెట్టినట్లు శ్రీకాంత్ తెలిపారు.

అస్సాంలో పావగడ ఎమ్మెల్యే



అస్సాం విధాన సభలో ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్ వి వెంకటేశ్ గురువారం అస్సాంలో పర్యటించారు. ఇతని వెంట కర్ణాటక రాష్ట్రం బీసీ వర్గాలు, మైనారిటీ సంక్షేమ సమితి అధ్యక్షుడు, సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యే అస్సాం రాష్ట్రం విధాన సభను వీక్షించారు. అనంతరం విధాన సభ స్పీకర్ బిస్వజిత్ డైమరి నివాసానికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ ఎమ్మెల్యే వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ ముందంజ



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్

ధర్మవరం అర్బన్: సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ నిరంతరం ముందంజలో ఉందని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్ పేర్కొన్నారు.పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న లయన్స్ కంటి ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది పనితీరు, కంటి ఆపరేషన్లు ఎలా జరుగుతున్నాయో ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఇప్పటికే వేల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి నిరుపేదలకు కంటిచూపును అందించారన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పి.వెంకటస్వామి, క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర, సభ్యులు గోసే రాధాకృష్ణ, పల్లెం వేణుగోపాల్, నాగరాజు, ఉట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా బాబావలి



బాబావలి

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన బాబావలి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ తెలి పారు. గురువారం జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడికి, జిల్లా కమిటీకి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

నో నెట్‌వర్క్..

రొద్దం మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సేవలకు నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే నెట్‌వర్క్ ఉండటం లేదు. బీఎస్ఎల్ఎల్ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే చుట్టు పక్కల గ్రామాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు ఎలా అందుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ఈ సమస్య ఉన్న పరిష్కారం చూపడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– రొద్దం:



రొద్దంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్

క్షయ వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు





మలుగూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం, సోమిరెడ్డిపల్లి వద్ద క్షయ వ్యాధి నివారణ గురించి ప్రజలకు వివరిస్తున్న ఎంపిహెచ్ఈఓ

హిందూపురం: టీబీ లక్షణాలున్న వారి గళ్లను సేకరించి, పరీక్షల అనంతరం నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ గౌస్ పీర్ తెలిపారు. గురువారం మండలంలోని మలుగూరు పంచాయతీలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య ఆదేశాలతో సర్వేలు చేసి, నియంత్రణకు మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టీబీ లక్షణాలున్న వారిని గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఎక్కువ కాలం జ్వరంతో బాధపడడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడడం, ఛాతీలో నొప్పి రావడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఈ లక్షణాలుంటే టీబీ వ్యాధి ఉన్నట్లు గుర్తించి, మందులు పూర్తిగా ఇస్తున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధిపై అవగాహన, నియంత్రణలో భాగంగా ప్రతి గురువారం ఒక్కోగ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ ఎంపీహెచ్ఓలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలి

లేపాక్షి: క్షయ వ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ వెంకట చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని సోమిరెడ్డిపల్లి వద్ద క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సీతామహాలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి టీబీ సూపర్‌వైజర్ పవన్, రవీంద్రరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ



చికిత్స పొందుతున్న నిత్యానందంను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: కొత్తం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ డీలర్ నాగరాజు సోదరుడు నిత్యానందం రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడి తుముకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంతున్నాడు. గురువారం నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలిసి నిత్యానందంను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసకున్నారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు రుద్రప్ప, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ నగేష్‌బాబు

మడకశిరరూరల్: మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలోని హిందూపురం ప్రధాన రోడ్డుపై గురువారం సిబ్బందితో కలసి సీఐ నగేష్‌బాబు వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించి రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సీఐ సూచించారు.

కోగిర జయచంద్రకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం



డీఆర్ఓ మలోల చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న జయచంద్రారెడ్డి

పెనుకొండ: పట్టణానికి చెందిన మిమిక్రీ కళాకారుడు కోగిర జయచంద్రారెడ్డికి ఎన్టీఆర్ స్మారక పురస్కారం లభించింది. గురువారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా డీఆర్ఓ మలోల చేతులమీదుగా కోగిర జయచంద్రారెడ్డికి పురస్కారం అందజేశారు.

శుభకార్యం

గోరంట్ల: మండల పరిధిలోని శింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దన యాదవ్ మేనల్లుడు హరికృష్ణ వివాహం గురువారం స్థానిక రాజ్‌ఫంక్షన్ హాల్‌లో జరిగింది. వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటేశు, టౌన్ కన్వీనర్ మేదర శంకర, గోరంట్ల ఉపసర్పంచ్ రాజారెడ్డి, నాయకులు రాజారెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ల సీజ్

పరిగి: మండలంలో పైడేటి నుంచి పరిగికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గురువారం పోలీసులు అడ్డుకున్నారు. మట్టి తరలించేందుకు అనుమతులు లేకపోవడంతో టిప్పర్లను సీజ్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువులు అందించిన సమాచారం.. గ్రామానికి చెందిన రఘు పావగడలో సోదరితో మాట్లాడి బెంగళూరుకు బైక్‌పై బయలుదేరాడు. హిందూపురం సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో అతడి తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తీసుకెళ్లారు.

కర్ణాటక పోలీసుల విచారణ

హిందూపురం: పట్టణంలో కర్ణాటక పోలీసులు గురువారం పలు ప్రాంతాల్లో విచారణ చేశారు. కర్ణాటక ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు దొంగలించి, అమ్మకాలు చేసిన వ్యక్తిని పట్టుకునేందరుదుకు పలు ప్రాంతాల్లో విచారణలు చేశారు. ఇందులో భాగంగా శ్రీకంఠపురంలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం కర్ణాటకకు తీసుకెళ్లినట్లు తెలిసింది.

8న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జూన్ 8న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో గురువారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఎస్ఐకు సూచనలిస్తున్న సీఐ రాజుకుమార్

అగళి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మడకశిర సీఐ రాజకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ వీరేష్‌ను ఆదేశించారు. మండలంలో శాంతిభద్రల సమస్యలు తలెత్తకుండా చూడాలని, నేరాల అదుపుకు కృషి చేయాలని సూచించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

అమరాపురం: స్థానిక చెరువు కట్ట ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక



ఓబిరెడ్డి

అమరాపురం: తమ్మడేపల్లి గ్రామ సచివాలయం– 2లో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓబిరెడ్డి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ఎంపీడీఓ రామరావు గురువా రం తెలిపారు. గోవాలోని పెడ్డెమ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 21 నుంచి జరిగిన పోటీల్లో విజేతగా నిలవడంతో అతడిని నిర్వాహకులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ చెస్ టోర్నీ కి ఎంపిక చేశారన్నారు. చెస్ టోర్నీకి ఎంపిక కావడంతో సహచర ఉద్యోగులు, ఎంపీడీఓ తదితరులు ఓబిరెడ్డికి అభినందనలు తెలిపారు.

న్యాయం చేయాలని డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న బాధిత మహిళలు

హిందూపురం: మనేసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 21లో ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని, డబ్బులు వసూలు చేసి, తిరిగి అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని బాధిత మహిళలు హిందూపురం డీఎస్పీ మహేష్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. పట్టాలు ఇప్పిస్తామని వందలాది మందితో కొందరు డబ్బులు వసూలు చేశారని, అయినా జాబితాలో పేర్లు లేవని, దీనిపై అడిగితే దౌర్జన్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలుకు చర్యలు

హిందూపురం: హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు హిందూపురం తహసీల్దార్ వెంకటేశు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మణేసముద్రం వద్ద పిటీషన్‌దారులు 447 మంది ఇంటిపట్టాల కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఏపీ హైకోర్టు డబ్ల్యూపీ నం.4918 ఉత్తర్వులను అమలు చేసేందుకు పిటీషన్‌లో పేర్కొన్న చిరునామాల్లో విచారించగా, పిటీషన్‌దారులు ఆయా చిరునామాలో లేరని నిర్ధారణ అయ్యిందని తహసీల్దార్ తెలిపారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే పిటీషన్‌దారులు తమ వద్ద ఉన్న రికార్డులు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నివాసం ఉన్న ఇంటి కరెంట్ బిల్లు, సెల్ నంబరు వివరాలతో ఏడు రోజుల్లోపు తహసీల్దార్ కార్యాలయ పనివేళల్లో అందజేయాలని తెలిపారు. ఆఫీసులో ఉన్న రికార్డుల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

కదిరి టౌన్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఖైదీలను ఉంచిన బ్యారక్‌లు, వంటగది, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని జడ్జి వారికి సూచించారు.